# ఈశాన్య భారతం- అశాంతి నిలయం

**తెగల మధ్య వైరుధ్యాలు, వైషమ్యాలు, వేర్పాటువాద ఉద్యమాలతో ఈశాన్య భారతంలోని ఏడు రాష్ట్రాలు (అసోం, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, త్రిపుర, మేఘాలయ) అశాంతి నిలయాలుగా మారాయి. ఆ ప్రాంతంలో నిత్యం ఏదో ఒక చోట ఘర్షణలు సర్వసాధారణమయ్యాయి. ప్రస్తుతం మణిపూర్‌లో ఆర్థిక దిగ్బంధం ప్రజాజీవితాన్ని చిన్నాభిన్నం చేస్తోంది. ఉల్ఫా, నేషనల్ సోషలిస్టు కౌన్సిల్ నాగాలిమ్ (ఇజాక్, ముయివా) తో చర్చల ప్రక్రియ సాగుతోంది.**

మన దేశపు ఈశాన్య ప్రాంతంలోని ఏడు రాష్ట్రాలు దీర్ఘకాలంగా అస్థిరత, అలజడి, వేర్పాటు, ఉగ్రవాదాలకు నిలయంగా మారాయి. అసోం, అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, త్రిపుర, మేఘాలయలు సప్తసోదరి రాష్ట్రాలు (SEVEN SISTER STATES)గా పేరొందాయి. వీటిలో అసోం భౌగోళికంగా ప్రాధాన్యం కలది. ఆరు సరిహద్దు రాష్ట్రాలను దేశంలో కలిపి ఉంచుతున్న కీలక భాగంలో ఉంది. వీటికి సరిహద్దులో చైనా, భూటాన్, బంగ్లాదేశ్, మయన్మార్, నేపాల్ దేశాలున్నాయి. ఈ రాష్ట్రాలు అనేక జాతులు, ఉపజాతులు, తెగలు, భాషలు, సంస్కృతులకు నిలయం. కొండలు, లోయలతో కూడిన ఈ ప్రాంతంలో రవాణా వ్యవస్థ అనుకూలంగా ఉండదు. దీంతో దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి ఈ రాష్ట్రాలకు రాకపోకలు అంత అనువుగాలేవు. చమురు, తేయాకు, కాఫీ తదితరాలకు ఈ ప్రాంతం ప్రసిద్ధి చెందింది. అయినా అభివృద్ధికి నోచుకోలేదు. గతంలో చైనా తదితర దేశాలతో ఈ ప్రాంతం నుంచి సరిహద్దు వ్యాపారం జోరుగా సాగేది. చైనాతో 1962 యుద్ధం, బంగ్లాదేశ్‌తో సంబంధాలు దెబ్బతినడం, మయన్మార్‌లో సైనిక నియంతృత్వ పాలన వంటి కారణాలతో సరిహద్దు వ్యాపారాలకు ఆటంకం ఏర్పడింది. ఈ ప్రాంతంలో వేర్వేరు పేర్లతో ఆందోళనలు, వేర్పాటు ఉద్యమాలు సాగుతుండడం.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉదాసీనత, నిర్లక్ష్య వైఖరితో ఇవి అభివృద్ధి చెందలేదు.

గడచిన దశాబ్దాలతో పోల్చుకుంటే ప్రస్తుతం ఈ రాష్ట్రాల్లో ప్రజా జీవనం కొంతమేరకు ప్రశాంతంగానే సాగుతోందని చెప్పొచ్చు. కానీ నేటికి వీటిలో ఏదో ఒక తరహాలో ఆందోళనలు, ఉద్యమాలు సాగుతూనే ఉన్నాయి. అసోం, మణిపూర్, నాగాలాండ్, త్రిపుర, మేఘాలయలో అనేక మిలిటెంట్ గ్రూపులు ఇప్పటికీ పనిచేస్తున్నాయి. అసోంలో ఉల్ఫా (యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అస్సాం) నేషనల్ డెమోక్రటిక్ ఫ్రంట్ ఆఫ్ బోడోలాండ్; బోడో సెక్యూరిటీ ఫోర్స్; నాగాలాండ్‌లో నేషనల్ సోషలిస్టు కౌన్సిల్ ఆఫ్ నాగాలాండ్‌కు చెందిన రెండు గ్రూపులు; మణిపూర్‌లో పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ ఆఫ్ మణిపూర్; యునైటెడ్ నేషనల్ లిబరేషన్ ఫ్రంట్; పీపుల్స్ రివల్యూషనరీ పార్టీ ఆఫ్ కాంగ్లీపాక్; త్రిపురలో నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర; ఆల్ త్రిపుర టైగర్స్ ఫోర్స్; మేఘాలయలో అచిక్ నేషనల్ వాలంటీర్ కౌన్సిల్; హెన్నీట్రెప్ నేషనల్ లిబరేషన్ కౌన్సిల్; హెమర్ పీపుల్స్ కన్వెన్షన్–డెమోక్రసీ సంస్థలు తీవ్రవాద కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఘర్షణలతో అల్లాడుతున్న ఈ ప్రాంతం అభివృద్ధిలో వెనుకబడింది.

దీంతో కేంద్ర ప్రభుత్వం 1971లో ఈశాన్య రాష్ట్రాల కౌన్సిల్ చట్టం చేసింది. ప్లానింగ్, భద్రతా వ్యవహారాలు పర్యవేక్షించే సంస్థగా రూపొందించిన ఈ చట్టం 1972 నుంచి అమల్లోకి వచ్చింది. దీని ద్వారా ఇప్పటివరకు రూ. 4 వేల కోట్లకుపైగా ఖర్చుచేశారు. వీటిలో 43 శాతం నిధులను రవాణా, కమ్యూనికేషన్ల అభివృద్ధికి, 33 శాతం విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు వెచ్చించారు. కాగా యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం 1997లో శుక్లా కమిషన్ సూచన మేరకు ఈశాన్య రాష్ట్రాల కౌన్సిల్‌ను ఈశాన్య భారత అభివృద్ధి కౌన్సిల్‌గా మార్చింది. ఇది ఈశాన్య ప్రాంత అభివృద్ధికి తోడ్పడే థింక్‌టాంక్‌గా వ్యవహరించాలని పేర్కొంది. అయినా చెప్పుకోదగిన మార్పు సాధ్యంకాలేదు.

## అసోం చరిత్ర:

అసోం మొదట్లో ప్రాగ్జోతిష్ (తూర్పు వెలుగు) రాజ్యంగా వ్యవహారంలో ఉంది. పురాణాల్లో కూడా దీని ప్రస్తావన ఉంది. కామరూప రాజ్యమని కూడా పిలిచేవారు. ఈ ప్రాంతంలో ఆది నుంచి బోడో, అహోం, కబాస్ అనే తెగలకు చెందిన ప్రజలు నివసించేవారు. ఆ తర్వాత మంగోలాయిడ్ తెగల వలసలు, దాడులతో ఈ ప్రాంత స్వరూప స్వభావాలు మారాయి. 1669లో ఔరంగజేబుతో జరిగిన యుద్ధం (1673వరకు కొనసాగింది)లో చక్రవర్తి ఉదయాదిత్య విజయం సాధించారు. ఈ యుద్ధంలో పాల్గొన్న రాజసేనాని లచిత్ బార్ ఫుకాన్ అస్సామీ జాతీయయోధుడిగా చరిత్రలో నిలిచిపోయాడు. 18వ శతాబ్దం చివరిలో మొరిమోరియా రైతాంగ తిరుగుబాటు, 19వ శతాబ్దపు తొలి దశకంలో బర్మా దండయాత్రలు, కాలాఅజార్ వ్యాధి అసోంను దెబ్బతీశాయి.

కొండ ప్రాంతాల్లో కచారీ, జయంతియా, మణిపూర్, దుప్లా, అవాస్, అబోర్, మిరి మొదలైన ఆటవిక రాజ్యాలుండేవి. 14వ శతాబ్దంలో బోడో, కోచ్ రాజ్యాలు బలపడ్డాయి. 16వ శతాబ్దంలో నాగా, కోచ్ రాజ్యాలకు అహోం చక్రవర్తులతో ఘర్షణలు జరిగాయి. 18వ శతాబ్దం చివరిలో బర్మీయులు వీటిని ఆక్రమించుకున్నారు. 1873లో బ్రిటిష్ వారు అసోంను ఆక్రమించుకున్నారు. గిరిజనులు తమ స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడారు. ఇది దేశంలోని మిగతా ప్రాంతాల్లో జరిగిన స్వాతంత్ర్యోద్యమంలో అంతర్భాగంగా మాత్రం సాగలేదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఈ ప్రాంతం అనేక రాష్ట్రాలుగా విడిపోయింది. 1963లో నాగాలాండ్, 1973లో మేఘాలయ, మిజోరాం ఏర్పాటు అయ్యాయి. తొలుత కేంద్రపాలిత ప్రాంతంగా, 1987 నుంచి పూర్తి ప్రతిపత్తి గల రాష్ట్రంగా అరుణాచల్‌ప్రదేశ్ అవతరించింది. బ్రిటిష్ పాలనలో అసోంలోకి ఇతర ప్రాంతాల వారి వలసలను ప్రోత్సహించారు. దశాబ్దాలు గడిచే కొద్దీ బయటివారి ప్రాబల్యం పెరుగుతుందనే భావన స్థానికుల్లో బలపడింది. త్రిపురతో సహా ఈశాన్య ప్రాంతాన్ని బెంగాల్‌లో కలిపివేయాలనే డిమాండు వచ్చింది. దీంతో స్థానికుల్లో నిరసన వెల్లువెత్తింది. అస్సామీల్లో చైతన్యానికి 'అస్సాం సాహిత్య సభ' కృషి చేసింది. అసోంలోకి విజాతీయుల ప్రవేశాన్ని నిరోధిస్తూ 1950లో చేసిన చట్టం 1957లో రద్దయింది. 1960లో అస్సామీని రాష్ట్ర అధికార భాషగా ప్రకటించారు. దాంతో బెంగాలీలు, అస్సామీల మధ్య ఘర్షణ

తలెత్తింది. ఆసు పేరిట అసోం విద్యార్థులు రాజకీయ సంచలనం సృష్టించారు. ఆ సమస్యతో పాటు ఈశాన్య ప్రాంతంలోని వివిధ తెగల మధ్య వైరుధ్యాలు, వైషమ్యాలు కారణంగా ఘర్షణలు తలెత్తాయి. అవి క్రమేపీ అనేక రూపాలు తీసుకుని ప్రత్యేక రాష్ట్రాల ఏర్పాటుకు, ఇప్పుడు ప్రత్యేక దేశాల డిమాండ్లకు దారి తీశాయి.

## చర్చలు దిశగా ఉల్ఫా

అసోంలో మూడు దశాబ్దాల పాటు మారణహోమానికి కారణమైన నిషేధిత సంస్థ యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అసోం(ఉల్ఫా). అసోంలోకి బంగ్లాదేశీయుల చొరబాట్లను నిరసిస్తూ ప్రారంభమైన ఆసు (ఆల్ అసోం స్టూడెంట్స్ యూనియన్) ఉద్యమం దరిమిలా ఉల్ఫా అవతరించింది. అసోంను సార్వభౌమాధికారం గల స్వతంత్ర దేశంగా ప్రకటించాలని డిమాండుచేస్తోంది. 1990 నుంచి ప్రభుత్వం దీని అణచివేతకు భారీగా సైన్యాన్ని ఉపయోగిస్తోంది. 2009లో ఆపరేషన్ బజ్రంగ్ పేరుతో ఉల్ఫాపై ఉక్కుపాదం మోపింది. పొరుగున ఉన్న భూటాన్ తమ భూభాగంలోని ఉల్ఫా స్థావరాలను ధ్వంసం చేసింది. బంగ్లాదేశ్‌లో ఖలీదా జియా అధికారం కోల్పోయి హసీనా వాజెద్ ప్రధానిగా రావడంతో ఉల్ఫా కార్యకలాపాలపై ఆ దేశం పట్టు బిగించింది. దీంతో ఉల్ఫాకు ఊపిరి ఆడని పరిస్థితి నెలకొంది. ఉల్ఫా అధ్యక్షుడు అరవింద్ రాజ్ ఖోవా, ఆ సంస్థ స్వయం ప్రకటిత విదేశాంగ శాఖ కార్యదర్శి శశిధర్ చౌదరిని ఢాకా పోలీసలు అరెస్టు చేసి భారత్‌కు అప్పగించారు. ఈయన 1992లో దేశం నుంచి పారిపోయారు. ఉల్ఫా అగ్రనాయకుల్లో ఒకరైన పరేశ్ బారువా మాత్రం మయన్మార్, థాయ్‌లాండ్, చైనాలలో తలదాచుకున్నట్లు చెబుతున్నారు. వాస్తవానికి ఉల్ఫాకు చెందిన అనేక మంది గత కొద్ది సంవత్సరాలుగా లొంగుబాటపట్టారు. ఇలా లొంగిపోయిన వారందరూ కలసి సల్ఫా(సరెండర్డ్ ఉల్ఫా) అనే సంస్థను ఏర్పాటుచేశారు. ప్రస్తుతం ఉల్ఫా, కేంద్ర ప్రభుత్వం మధ్య చర్చలు కొనసాగుతున్నాయి. పరేశ్ బారువా మాత్రం చర్చలను వ్యతిరేకిస్తున్నారు. కాగా బారువా లేకుండా జరిపే చర్చలు ఫలవంతం కావని గతంలో ఉల్ఫా తరపున చర్చల్లో పాల్గొన్న రచయిత, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత ఇందిరా గోస్వామి వ్యాఖ్యానించారు. హింసను విడనాడి, సార్వభౌమత్వ డిమాండ్‌ను పక్కనబెట్టి చర్చలకు రావాలని ప్రభుత్వం కోరుతోంది.

## మణిపూర్‌లో దిగ్బంధం:

మణిపూర్ రెండు మాసాలుగా ఆర్థిక దిగ్బంధంలో నలిగిపోతోంది. ఇక్కడ నివసించే నాగాలు, కుకీలు, మెయితీ తెగల ప్రజల మధ్య వైషమ్యాలున్నాయి. ప్రస్తుత పరిస్థితికి అవి ఆజ్యం పోశాయి. జిల్లా మండళ్లకు ఎన్నికలు నిర్వహించవద్దని, దానివల్ల తమ సాంప్రదాయిక అధికారాలకు భంగం వాటిల్లుతుందని నాగాలు పట్టుపట్టారు. ఓక్రం ఇబోబీ సింగ్ ప్రభుత్వం వారి మాటను తోసిపుచ్చి ఎన్నికలు నిర్వహించింది. దీన్ని నిరసిస్తూ అఖిల నాగా విద్యార్థి సంఘం ఏప్రిల్ 11న జాతీయ

రహదారులు 39, 53ను దిగ్బంధించింది. మే 4న నాగా విద్యార్థి సమాఖ్య కూడా ఈ ఉద్యమంలో చేరింది. ఈలోగా నేషనల్ సోషలిస్టు కౌన్సిల్ ఆఫ్ నాగాలిమ్(ఇజాక్,ముయివా) ప్రధాన కార్యదర్శి తుయింగ్‌లెంగ్ ముయివా మణిపూర్‌లోని తన పూర్వీకుల గ్రామాన్ని సందర్శించుకోవాలనుకోవడం, రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవడంతో పరిస్థితి మరింత విషమించింది. ఆయనను అడ్డుకునే ప్రయత్నంలో పోలీసులు జరిపిన కాల్పుల్లో పలువురు నాగాలు మరణించారు. నాగాలకు ప్రత్యేక దేశం కోసం పోరాడుతూ ఆ తెగకు తిరుగులేని నాయకుడిగా మయివా చలామణి అవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చొరవతో నాగా విద్యార్థి సమాఖ్య తాత్కాలికంగా దిగ్బంధాన్ని విరమించింది. అఖిల నాగా విద్యార్థి సంఘం మణిపూర్ మాత్రం దిగ్బంధం కొనసాగిస్తోంది. దీనివల్ల నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటాయి. ప్రజాజీవితం అతలాకుతలమవుతోంది.

నాగాల్లో ఎక్కువ మంది క్రైస్తవ మతస్థులే. ఇందుకు ప్రధాన కారకులు రెవరెండ్ మైల్స్ బ్రాన్సన్, ఈ డబ్ల్యూ క్లార్క్. చైతన్యవంతులైన కొందరు నాగాలు 1918లో నాగా క్లబ్‌ను ఏర్పాటుచేశారు. 1945లో నాగా హిల్స్ డిస్ట్రిక్ట్ ట్రైబల్ కౌన్సిల్ ఏర్పాటైంది. అసోం పరిధిలోని నాగా ప్రాంతాలకు స్వయంప్రతిపత్తి సాధించడం ఈ కౌన్సిల్ మౌలిక లక్ష్యం. కేవలం ఏడాది కాలంలోనే దాని ఆశయం, నాగా ప్రాంతాలన్నింటినీ ఏకంచేసి స్వాతంత్ర్యం సాధించడంగా మారింది. ఈ వేర్పాటు వాదాన్ని అంగామిజపు ఫిజో ప్రారంభించారు. ఆయనను నాగాల గాంధీగా వ్యవహరిస్తారు. 1947 ఆగస్టు 14 నాగాలాండ్ నేషనల్ కౌన్సిల్ నాయకుడు ఫిజో స్వాతంత్ర్యం ప్రకటించుకున్నారు. దాన్ని మన సైన్యం తిప్పికొట్టింది. నాటినుంచి ఈ వేర్పాటు ఉద్యమం కొనసాగుతూనే ఉంది.

## ఇతర ఉద్యమాలు

బోడోలు నివసించే ప్రాంతాలన్నింటినీ కలిపి స్వతంత్ర ప్రతిపత్తి గల ప్రాంతంగా ప్రకటించాలని నేషనల్ డెమొక్రటిక్ ఫ్రంట్ ఆఫ్ బోడోలాండ్ ఉగ్రవాద సంస్థ కోరుతోంది. మణిపూర్‌ను స్వతంత్ర దేశంగా ప్రకటించాలని పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ, యునైటెడ్ నేషనల్ లిబరేషన్ ఫ్రంట్, పీపుల్స్ రివల్యూషనరీ పార్టీ ఆఫ్ కాంగ్లీపాక్ పోరాడుతున్నాయి. మేఘాలయ గారో కొండల్లో అచిక్‌ల్యాండ్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని అచిక్ నేషనల్ వాలంటీర్ కౌన్సిల్, మేఘాలయపై గారో ఆధిపత్యాన్ని ఎదుర్కొనేందుకు హెన్యూట్రెప్ నేషనల్ లిబరేషన్ కౌన్సిల్ పోరాడుతున్నాయి.